క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షకు 179 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. పరీక్షలకు సంబంధించి మొత్తం 312 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 133 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. చాలా మంది విద్యార్థులకు హాల్ టికెట్లు అందక పోవటంతో పరీక్షలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పరీక్షల నిర్వహణ చీఫ్‌గా ఝాన్సీలక్ష్మీబాయి, అబ్జర్వర్‌గా భారతి వ్యవహరించారు. పరీక్షల నిర్వహణ తీరును ఎంఈఓ మస్తాన్‌నాయక్ పరిశీలించారు.

ఉల్లాస్ వయోజన విద్యపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బయ్య

తాళ్లూరు: మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో శనివారం ఉల్లాస్ వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం దేవరాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు అక్షరాస్యులు కావాలని, వారికి చదవడం.. రాయడం రావాలని, అప్పుడు మాత్రమే అక్షరాస్యులుగా నిర్ధారిస్తారని చెప్పారు. ఎంఈఓ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి స్త్రీ అక్షరాస్యురాలైతే వారి కుటుంబం బాగుపడుతుందని, తద్వారా వారికి ఇబ్బందులు తొలగుతాయన్నారు. అనంతరం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, అకౌంటెంట్ కుమారి, వలంటరీ టీచర్స్, వీవోఏలు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



జైలును తనిఖీ చేస్తున్న జడ్జి బాలాజీ

మార్కాపురం: మార్కాపురం సబ్ జైలును ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జి.బాలాజీ శనివారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారికి లభిస్తున్న సేవలు అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏవైనా కుల వివక్ష ఉందా.. అని ఆరా తీశారు. ఖైదీలకు జైలులో సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. న్యాయవాది రామచంద్ర ఉన్నారు.

కాలం చెల్లిన వంతెనలతో రాకపోకలకు కష్టాలు



ప్రగళ్లపాడు సమీపంలో శిథిలావస్థకు చేరిన తీగలేరు వంతెన

పెద్దారవీడు: మండల పరిధిలోని పలు గ్రామాల మధ్య తీగలేరుపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థలో ఉండటంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. ప్రగళ్లపాడు నుంచి ఏనుగులదిన్నెపాడు, రామాయపాలెం నుంచి బద్వీడుచెర్లోపల్లి గ్రామాల మధ్యలో ఉన్న తీగలేరు వంతెనలు బలహీనంగా ఉండటంతో ఏ క్షణంలోనైనా కూలిపోతుందోనని వాహనదారులు రాకపోకలు సాగించాలంటే భయాందోళన చెందుతున్నారు. ప్రగళ్లపాడు తీగలేరు వంతెన మీదుగా ఏనుగుదిన్నెపాడు, చట్లమిట్ల, కర్రోల, పోతంపల్లి, రేగుమానిపల్లి, రాజంపల్లి, తదితరల గ్రామాలు, రామాయపాలెం తీగలేరు వంతెన మీదుగా సానికవరం, చాట్లమడ అగ్రహారం, మద్దలకట్ట, తమ్మడపల్లి, చిన్నగుడిపాడు, బొమ్మలాపురం గ్రామాల ప్రజలు నిత్యం పెద్దారవీడు, మార్కాపురం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనలపై ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు తిరుగుతుంటాయి. రాకపోకలు సాగాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నామని వాహనదారులు వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతర లేక వంతెనలపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ల పరిశీలనలో వివరాలు గోప్యం

- లబ్ధిదారుల సమాచారం దాస్తున్న అధికారులు
- అధికార పార్టీ మద్దతుదారుల నకిలీ పింఛన్లు రద్దు చేసేనా?



పొట్లపాడులో పింఛన్‌దారులను పరీక్షిస్తున్న వైద్యులు, ఎంపీడీఓ

కురిచేడు: మండలంలో పింఛన్ల లబ్ధిదారుల పరిశీలనను అధికారులు గోప్యంగా చేస్తున్నారు. అధికారులు బహిరంగంగా పరిశీలన చేసి వాస్తవాలను బహిరంగ పరచాల్సిన అవసరం ఉన్నా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఎవరి మెప్పు కోసం సమాచారం దాస్తున్నారని పలువురు పింఛన్‌దారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల పరిశీలన ఇలాగే గోప్యంగా కొనసాగితే అధికార పార్టీ నాయకులు పక్క జిల్లాల నుంచి తెచ్చిన నకిలీ సర్టిఫికెట్ల విషయం బయట పడకుండా, వారి పింఛన్లు రద్దు కాకుండా ఉండేందుకే? అని పలువురు నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు పెట్టి అధికార పార్టీకి చెందిన వారు ఎక్కువగా పింఛన్లు పొందుతున్నారు. వాటి వివరాలు గోప్యంగా ఉంచి అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం అధికారులు తాపత్రయ పడుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. శనివారం మండలంలోని పొట్లపాడు, దేకనకొండ, బోధనంపాడు, అలవలపాడు గ్రామాల్లో వైద్యులతో కలిసి ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది పింఛన్ల లబ్ధిదారుల పరిశీలనకు వెళ్లారు. పరిశీలన అనంతరం ఎంపీడీఓ సతీష్‌బాబు పాత్రికేయులకు మొక్కుబడిగా సమాచారం ఇవ్వటం ప్రజల విమర్శలకు బలాన్ని చేకూర్చుతోంది. ఏ గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులను పరిశీలించారు? ఎంతమంది ఒరిజనల్, ఎన్ని నకిలీ పింఛన్లుగా గుర్తించారు, ఎవరెవరు పరిశీలనలో పాల్గొన్నారనే విషయాలను ఎంపీడీఓ తెలపక పోవటం గమనార్హం. ఎంపీడీఓ సతీష్ బాబును ఫోన్‌లో సమాచారం కోరినా ఇవ్వకుండా మాట దాటవేయడం వెనుక అంతర్యమేమిటో ఆ అధికారికే తెలియాలి. ప్రజాప్రతినిధులు, పాత్రికేయులకు సమాచారం ఇచ్చి పరిశీలన చేస్తే వాస్తవాలు బయట పడతాయనే అనుమానంతో జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. మండలంలోని నకిలీ పింఛన్‌దారులతో అధికార పార్టీ నాయకులు కొందరు బేరసారాలు చేస్తున్నట్లు, వారు అడిగినంత ఇవ్వకుంటే పింఛన్ రద్దు చేయిస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రి ఉన్నా, పక్క జిల్లాల నుంచి మంచి వారికి కూడా కిడ్నీ వ్యాధులున్నట్లు, కంటి చూపు లేనట్లు డాక్టర్ సర్టిఫికెట్లు తెచ్చి పింఛన్లు పొందుతున్న వారు చాలామంది ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని పింఛన్‌దారుల డాక్టర్ సర్టిఫికెట్లు పరిశీలించి ఇతర జిల్లాల నుంచి డాక్టర్ సర్టిఫికెట్లు తెచ్చిన వారిని ప్రజల సమక్షంలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని, జిల్లా అధికారులు మండలానికి సంబంధం లేని అధికారులతో పరిశీలన చేయించి నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, నకిలీ పింఛన్‌దారుల నుంచి పింఛన్లు రికవరీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మోదీ, బాబు ఇద్దరూ మోసగాళ్లే



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు

దర్శి: పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ నిరుద్యోగ యువతను మోసం చేసిన మోసగాళ్లే అని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారావు విమర్శించారు. ఏఐవైఎఫ్ దర్శి నియోజకవర్గ మహాసభ స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉద్యోగ నోటిఫికేషన్‌లు కూడా ఇవ్వని ప్రధానమంత్రిగా చరిత్రలో నిలుస్తారన్నారు. రాష్ట్రంలో కూటమి నేతలు ఎన్నికల హామీల్లో నిరుద్యోగులకు ఆశాజనకమైన హామీలు ఇచ్చి ఇప్పుడు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి ఆ వైపుగా ఆలోచన కూడా చేయడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. అదేవిధంగా సాక్షాత్తు అత్యున్నత సభలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అవమాన కరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు రావడంపై ఆయన వ్యతిరేకత వ్యక్త పరిచారు. అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పకుండా ఏ విధంగా ప్రజల్లోకి వస్తారని ఆయన ప్రశ్నించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను చూస్తున్న చిన్నచూపుపై ఏఐవైఎఫ్ ఉద్యమబావుటా ఎగరవేస్తుందని తెలిపారు. జనవరి 26వ తేదీ ఒంగోలులో ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ జరుగుతుందని, ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ వరకు శ్రీకుకుంళంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభల్లో దేశంలో, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటికి పరిష్కారాలపై అధ్యయనం చేసి ఉద్యమ రూపకల్పన చేసి యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాటాలకు సిద్ధం అవుతామని చెప్పారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నెబోయిన రామాంజి యాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీరామ్ చటర్జీ, నరసింహ, నరేంద్ర, శ్యామ్, తిమోతి, అనిల్, స్టాలిన్, ప్రభుదేవా పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు (దర్శి): అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు అధికారులంతా హాజరు కావాలన్నారు. అధికారులంతా హాజరైతేనే ప్రజా సమస్యల పరిష్కారానికి వీలవుతుందన్నారు. ఈసారి సమావేశంలో అధికారులందరూ హాజరు కాకుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు ద్వారా సభ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ వచ్చే సర్వసభ్య సమావేశం రోజుకు పూర్తిగా పరిష్కరించాలని ఎంపీపీ సునీత అధికారులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఇతర నాయకులు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ నెల 13వ తేదీ నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. టోర్నమెంట్‌లో పాల్గొన్న 71 టీంలు రెండు ప్లే గ్రౌండ్‌ల్లో పోటాపోటీగా తలపడుతున్నాయి. ఆదివారం నాటితో క్రికెట్ టోర్నమెంట్ ముగియనుంది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొంటున్నారు. శనివారం జరిగిన టోర్నమెంట్ మూడో రౌండ్‌లో నరజాముల తండా, రేగూమానిపల్లె, పెద్దారవీడు కిక్ ఫోర్స్, గణపవరం, పుల్లలచెరువు టీంలు విజేతలుగా కొనసాగుతున్నాయి. క్వార్టర్ ఫైనల్లో త్రిపురాంతకం హోం టీం నిలిచింది. ఆదివారం ఈ టీంలు ఫైనల్‌కు చేరేందుకు తలపడనున్నాయి. ఆరు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి స్వయంగా పర్యవేక్షిస్తూ ఎటువంటి సమస్యలు ఎదురు కాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. విన్నర్ టీంకు మెమోంటోతో పాటు రూ.50 వేలు, రన్నర్ టీంకు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన టీంకు రూ.20 వేలు, మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఫీల్డర్‌లకు కూడా బహుమతులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

చిల్లకంప తొలగింపు

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో శివాలయం, హనుమాన్ టెంపుల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో నిండిపోయింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిక్కా రామాంజనేయరెడ్డి జేసీబీ యంత్రంతో చిల్లకంప తొలగింపు చర్యలు చేపట్టారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు బాగు చేయడంతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా విజయభాస్కరరావు



విజయభాస్కరరావును అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

తర్లుపాడు: మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా జవ్వాజి విజయభాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పట్టాభిరామస్వామి దేవాలయంలో నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు. బొంతల సుధీర్, పేరం ప్రసాద్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా కె.రవికుమార్ ఎంపికయ్యారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ అధ్యక్షులు కె.జగన్‌బాబు, ఆలిండియా ఆర్యవైశ్య సంఘ ఏపీ జాయింట్ సెక్రటరీ పోలేపల్లి జనార్దన్, వాసవీ సత్రం మెంబరు దోగిపర్తి మల్లికార్జునరావు, స్థానికులు జవ్వాజి వెంకటేశ్వర్లు, గాదంశెట్టి శేషగిరిరావు, వాగిచర్ల మోహన్‌రావు, టి.సురేష్, నున్న సుబ్బారావు, చిన్నమనగుండం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం



ముస్తాబైన స్వామి వారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కళ్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయం మధ్య రంగ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దొనకొండ: కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు శనివారం అధికారులు గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ స్వచ్ఛ ఆంధ్ర–దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు వీధుల వెంట ఉన్న చెత్తను తొలగించారు. బోరింగుల వద్ద మురుగు నీరు తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లారు. స్థానిక 4 రోడ్ల ప్రాంతంలో ఎంపీడీఓ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి దావూద్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ టి.దేవయ్య, స్థానిక పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మంచంపట్టిన తమ్మలూరు

- ప్రజలకు విషజ్వరాలు, కాళ్ల నొప్పులు
- ఆర్ఎంపీల వద్ద బారులు తీరుతున్న జ్వరపీడితులు
- గ్రామంలో పారిశుధ్యం అధ్వానం
- పట్టించుకునే నాథుడే కరువు



మురుగు కాలువ ఇలా..



సెలైన్‌లు కట్టించుకున్న మహిళలు



నీరసంతో మంచం పట్టిన వ్యక్తి



జ్వరంతో ఉన్న బాలుడు

మండ్లమూరు (దర్శి): మండలంలోని తమ్మలూరులో ఇంటికొకరు మంచం పట్టారు. గ్రామంలో టైఫాయిడ్, ఇతర విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కాళ్ల నొప్పులు, ఒళ్లు నెప్పులు, జ్వరాలతో ఒకరు మార్చి మరొకరు మంచాన పడుతూనే ఉన్నారు. ఏ ఇంట్లో చూసినా చేతులకు సెలైన్‌లు పెట్టి కనిపిస్తున్నారు. గ్రామంలో మహిళలు, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఒకరు మార్చి ఒకరు మంచాన పడుతున్నారు. జ్వరంతో నీరసం వచ్చి కాలు కదపలేని పరిస్థితుల్లో గ్రామస్తులు ఉన్నారు. గ్రామంలో పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గ్రామంలో ప్రభుత్వ వైద్యులు పర్యటించిన పాపాన పోలేదు. దీంతో ఆర్ఎంపీలను సంప్రదించి వైద్యం చేయించుకుంటున్నారు. పరిస్థితి విషమించినప్పుడు ఒంగోలు వంటి ప్రాంతాలకు వెళ్లి చూయించుకుంటున్నారు. ఇలా గ్రామంలో వందలాది మంది విషజ్వరాల బారిన పడుతున్నా ఏ అధికారీ కన్నెత్తి కూడా చూడక పోవడం గమనార్హం.

ఎక్కడి మురుగు అక్కడే

గ్రామంలో పారిశుధ్యం పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. కాలువల్లో మురుగు తీసి ఆరు నెలలకుపైగా అవుతోందని గ్రామస్తులు చెప్తున్నారు. ఎక్కడ మురుగు అక్కడ నిలిచిపోయి వీధులు దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో మురుగు నిండి వచ్చిన నీరు రోడ్డు పక్క నుంచి ప్రవహిస్తోంది. దోమలు ప్రబలి నివాసాలను చుట్టుముడుతున్నాయి. రాత్రి పూట దోమల బాధతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు.